క్లుప్తంగా

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

భూత్పూర్: పట్టణంలోని గ్రంథాలయానికి రూ.30వేల విలువ గల పుస్తకాలను శనివారం దాత శ్రీనివాస్‌రావు అందజేసినట్లు లైబ్రేరియన్ మాధవిలత తెలిపారు. పట్టణానికి చెందిన రేణుక (ఎన్‌ఆర్‌ఐ), రేవతి, శ్రీనివాస్‌రావుల తల్లిదండ్రులు సీతమ్మ, వెంకట్ కిషన్‌రావు జ్ఞాపకార్థం గ్రూప్–1, 2, 3, 4 పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను అందజేసినట్లు వెల్లడించారు.

నేడు వైద్య శిబిరం

జడ్చర్ల టౌన్: పట్టణంలోని ఏగూర్‌ప్రైమ్ ఆస్పత్రిలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ అంకిత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శిబిరంలో బీపీ, షుగర్, దగ్గు, ఆయాసం, ఉబ్బాసం, థైరాయిడ్‌కు సంబంధించిన సమస్యలు, జ్వరాలకు ఉచితంగా పరీక్షలు చేస్తామని తెలిపారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు శిబిరం ఉంటుందని తెలిపారు.

ప్యాడ్లు, పెన్నులు పంపిణీ

మహబూబ్‌నగర్ రూరల్: మండలంలోని ధర్మాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు దివంగత పరందాములుగౌడ్ జ్ఞాపకార్థం శనివారం పరీక్ష ప్యాడ్లు, పెన్నులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసులు, పరందాములుగౌడ్ కుటుంబ సభ్యులు రాజశేఖర్‌గౌడ్, వినోద్‌గౌడ్, ఛత్రపతి శివాజీ యువసేన సభ్యులు హరి, వెంకట్‌రెడ్డి, సిద్ధూ, నరేష్, కన్నా తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

పాలమూరు: పట్టణ వాసవీ క్లబ్, వనితా క్లబ్ నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణస్వీకారం కార్యక్రమాన్ని శనివారం పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. వాసవీక్లబ్ అధ్యక్షుడిగా చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా వినోద్, కోశాధికారిగా రామచంద్రయ్య, వనితా క్లబ్ అధ్యక్షురాలిగా శ్రీదేవి, ప్రధాన కార్యదర్శిగా రాధిక, కోశాధికారిగా లావణ్య ప్రమాణస్వీకారం చేశారు.

పౌష్టికాహారం ముఖ్యం

పాలమూరు: భారత్ వికాస్ పరిషత్ పాలమూరు శాఖ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని రాజీవ్ స్వగృహలో ఉన్న రెసిడెన్షియల్ పాఠశాలలో కౌమార దశలో ఉన్న బాలికలకు ఉచిత రక్త పరీక్షలు నిర్వహించారు. రక్తహీనత కల్గిన బాలికలకు మందులు అందించారు. విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాండురంగం, రమేష్‌చందర్,ప్రసాద్, భూషణ్‌పాండే, సత్యనారాయణ పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు నిరంతరం శ్రమించాలి

అడ్డాకుల: గురువులు, పెద్దల నుంచి విద్యార్థులు తమ జీవితానికి అవసరమైన జ్ఞానాన్ని సంపాదించి జీవితంలో స్థిరపడాలని సైకాలజిస్ట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ సుభాషిణి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు గోపి అంజి ఆధ్వర్యంలో కెరీర్ బిల్డింగ్‌పై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రయత్నిస్తే ఏదైనా సాధ్యమవుతుందని, ఇందుకోసం నిరంతరం శ్రమించాలని తెలిపారు. మనిషి జీవితంలో యవ్వన దశ చాలా కీలకమైందన్నారు. యుక్త వయసును సక్రమంగా వినియోగించుకున్న వారే జీవితంలో సక్సెస్ అవుతారని అన్నారు.

రేపటి నుంచి శిక్షణ

బాలానగర్: ఈనెల 27 నుంచి ఓడీఎఫ్ ప్లస్ దిశగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీఓ నజీర్‌అహ్మద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓడీఎఫ్‌కు మండలంలోని అన్ని గ్రామాలను ఇప్పటికే ప్రభుత్వం గుర్తించిందని, వివిధ అంశాలపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, వీఓఏ, ఫీల్డ్ అసిస్టెంట్లకు శిక్షణ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మొదటి రోజు మండలంలోని కేతిరెడ్డిపల్లిలో శిక్షణ తరగతులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


హమీద్ (ఫైల్)

భూత్పూర్: మున్సిపాలిటీలోని శేరిపల్లి(బి) వద్ద రోడ్డు ప్రమాదంలో భూత్పూర్‌కు చెందిన ఎం.ఎ.హమీద్ (55) చికిత్స పొందు తూ మృతి చెందాడు. ఎస్‌ఐ విజయభాస్కర్ కథనం మేరకు పట్టణానికి చెందిన హమీద్ జిల్లా కేంద్రంలోని డీసీసీ బ్యాంకులో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం పనినిమిత్తం జడ్చర్లకు వెళ్లి తిరిగి రాత్రి వస్తుండగా వెనుక నుంచి లారీ ఢీకొంది. హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడు. శనివారం సోదరుడు సాధిక్ ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

స్కూటీని దగ్ధం చేసిన గుర్తుతెలియని వ్యక్తులు

మహబూబ్‌నగర్ క్రైం: ఇంటి ఎదుట నిలిపిన స్కూటీని గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని ఏనుగొండకు చెందిన మల్లెపోగు నర్సింహులు తన స్కూటీని శుక్రవారం రాత్రి ఇంటి ఎదుట పార్క్ చేశాడు. అయితే శనివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు స్కూటీని దగ్ధం చేశారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భౌ..భౌ.. హల్‌చల్


వాహనదారులను వెంబడిస్తున్న శునకం



జిల్లా కేంద్రంలోని వివిధ కాలనీల్లో వీధికుక్కలతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పట్టణంలోని బీకేరెడ్డి కాలనీ, మర్లు, కోయిలకొండ చౌరస్తా, ధనలక్ష్మి కాలనీల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉందని పలువురు వాపోతున్నారు. పాదచారులు, వాహనదారుల వెంట పడి కరుస్తున్నాయి. కుక్కల నుంచి తప్పించుకునే క్రమంలో వాహనదారులు కిందపడి గాయాలపాలవుతున్నారు. అలాగే పాఠశాలలకు వెళ్తున్న చిన్నారులు కుక్కలబారిన పడే ప్రమాదం కూడా లేకపోలేదు. రాత్రి సమయంలో కుక్కల బెడద మరీ ఎక్కువైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి కాపాడేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– భాస్కర్‌చారీ, సీనియర్ ఫొటోగ్రాఫర్


శేషాద్రినగర్ కాలనీలో వాహనదారులను వెంబడిస్తున్న కుక్కలు


వీధుల్లో తిరుగుతున్న కుక్కలు




మహిళను వెంబడిస్తూ.. బీకేరెడ్డి కాలనీలో వాహనదారుడి పైకి దూసుకువస్తూ..

లైన్‌మేన్‌పై దాడిచేసిన వ్యక్తిని శిక్షించాలి


ఫిర్యాదు చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): విధి నిర్వహణలో ఉన్న విద్యుత్ లైన్‌మేన్ ప్రమోద్‌కుమార్‌పై దాడి చేసిన చెన్నయ్యపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని విద్యుత్ ఉద్యోగులు కోరారు. ఈ మేరకు శనివారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో విద్యుత్‌శాఖ ఉద్యోగులు ఫిర్యాదు చేశారు. జిల్లా కేంద్రంలోని రాజేంద్రనగర్ శెట్టికాంప్లెక్స్‌లో గల తిరుమల మెస్‌కు చెందిన నాలుగు నెలల నుంచి కరెంట్ బిల్లు కట్టకపోవడంతో కనెక్షన్ తీసివేసినట్లు తెలిపారు. అందుకు తిరుమల మెస్ యజమాని మా లైన్ కట్ చేస్తావా అంటూ లైన్‌మేన్‌ను నోటికి వచ్చినట్లు తిట్టడమే కాకుండా చేయి చేసుకున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఉన్న లైన్‌మేన్‌పై దాడి చేసిన చెన్నయ్యపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం డీఎస్పీ మహేష్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో స్వామి, పాండు, పెంటయ్య, శేఖర్, సత్యం, భవవంతయ్య, రామరాజు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు..

మహబూబ్‌నగర్ క్రైం: మెస్‌కు సంబంధించిన విద్యుత్ కనెక్షన్ కట్ చేసిన సిబ్బందిపై ఓ వ్యక్తి దాడి చేయడంతో పాటు అసభ్యకరంగా దూషించాడు. టూటౌన్ ఎస్‌ఐ రవిప్రకాష్ కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని శెట్టి కాంప్లెక్స్ ఏరియాలో ఉన్న తిరుమల మెస్‌కు సంబంధించి గత నాలుగు నెలల నుంచి రూ.1,207 కరెంట్ బిల్ పెండింగ్‌లో ఉండటంతో శనివారం ఉదయం విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు లైన్‌మేన్ ప్రమోద్‌కుమార్ విద్యుత్ కనెక్షన్ తొలగించాడు. దీంతో తిరుమల మెస్ యజమాని చెన్నయ్య సదరు లైన్‌మెన్‌పై దాడి చేయడంతోపాటు అసభ్యపదజాలంతో దూషించాడు. ఈ ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పంచాయతీ కార్మికుల నిరసన


వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్మికులు

దేవరకద్ర: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట శనివారం ఇఫ్టూ అనుబంధ సంస్థ తెలంగాణ ప్రగతిశీల పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సాంబశివుడు మాట్లాడుతూ పంచాయతీ కార్మికులు మరుగుదొడ్లు కడగాలనే నిబంధనను విధించిందని ఆరోపించారు. మల్టీ పర్పస్ విధానంలో కార్మికులపై అదనపు పనిభారం మోపుతున్నదని, దీనికి తోడుగా గ్రామ పంచాయతీ, ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లను కడిగి శుభ్రం చేయాలని మెమో జారీ చేశారని విమర్శించారు. వెంటనే 2026 మెమోను రద్దు చేయాలని, ప్రతి నెల 10వ తేదీన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల పరిషత్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు వెంకటేశ్, సూరయ్య, బాలకిష్టమ్మ, సత్యమ్మ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎరువు దుకాణాల తనిఖీ


ఎరువుల దుకాణం తనిఖీ చేస్తున్న అధికారులు

దేవరకద్ర: మండల కేంద్రంలోని ఎరువులు, పురుగుల మందు దుకాణాలను శనివారం ఏడీఏ యశ్వంత్‌రావుతో పాటు మండల వ్యవసాయ అధికారులు తనిఖీ నిర్వహించారు. కోయిల్‌సాగర్ రోడ్‌లో ఉన్న షాపుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి షాపుల్లో, గోదాముల్లో ఉన్న ఎరువులు, మందులు, విత్తనాలను పరిశీలించారు. స్టాక్ రిజిష్టర్‌లో ఉన్న వివరాల ప్రకారం ఎంత స్టాక్ ఉందో చూశారు. అలాగే వాటికి సంబంధించిన బిల్లులను పరిశీలించారు. ఎంఆర్‌పీ ధరలకు ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు విక్రయించాలని, కొనుగోలు చేసిన వారి తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని వ్యాపారులను హెచ్చరించారు. ఎరువులతో పాటు కీటకనాశిని మందులు, గుళికలు కలిపి విక్రయించరాదని తెలిపారు. ఎరువులతో లింకు పెట్టి విక్రయాలు సాగిస్తే ఫర్టిలైజర్ కంట్రోల్ యాక్టు 1985 ప్రకారం లైసన్సులు రద్దు చేయడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తనిఖీలో మండల వ్యవసాయ అధికారి రాజేందర్ అగర్వాల్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

లిథియం గిగాసెల్ పరిశ్రమతో ఉపాధి : మంత్రి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: వాహన కాలుష్యాన్ని అరికట్టేందుకు దివిటిపల్లిలో అమర్‌రాజా సంస్థ ఏర్పాటు చేస్తున్న లిథియం గిగా సెల్ ఫ్యాక్టరీ దేశంలోనే మొదటిదని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడల శాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. శనివారం మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎదిరలో ఈద్గా పనులను పరిశీలించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఎదిర, దివిటిపల్లి సమీపంలో ఇప్పటికే ఐటీ పార్కు పూర్తికావచ్చిందన్నారు. ఒకప్పుడు ఉమ్మడి జిల్లా నుంచి బతుకుదెరువు కోసం 14లక్షల మంది వలసలు వెళ్లేవారన్నారు. తాజాగా ఈ ఫ్యాక్టరీ ఏర్పాటుతో వారు తిరిగి రావడమే గాక స్థానికంగా అనేక మందికి భారీగా ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. కాశ్మీర్‌లో ఇటీవల కనుగొన్న లిథియం నిల్వలపై ప్రపంచమంతా ఎన్నో ఆశలు పెట్టుకుందన్నారు. ఎలక్ట్రికల్ వాహనాలకు అవసరమైన బ్యాటరీలకు లిథియం గుండెకాయలాంటిదన్నారు. ఈవీలతో వాహన కాలుష్యాన్ని తరిమికొట్టే అవకాశం ఉంటుందన్నారు. ఈ పరిశ్రమ ఏర్పాటుకు అందరూ సహకరించాలనికోరారు. ఉద్దేశ్య పూర్వకంగా కొందరు అడ్డుకోవాలని చూస్తున్నారని, వారి ఆటలు సాగనివ్వబోమన్నారు.

ఏరిపారేసినట్లుండే..

2014కు ముందు ఎదిర అంటే ఏరిపారేసినట్లుండేదని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. తాగునీటికి సైతం కటకటలాడే పరిస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేశామన్నారు. ఈ ప్రాంతంలో కొత్త ఫ్యాక్టరీ పూర్తయితే జిల్లా మొత్తం దశ తిరుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, మార్కెట్ కమిటీ చైర్మన్ రహమాన్, కౌన్సిలర్ యాదమ్మ, బీఆర్‌ఎస్ నాయకులు హనుమంతు, అల్లి ఎల్లయ్య, శేఖర్, రాములు, హకీం, అజీజుల్లా పాల్గొన్నారు.

చదువుతోనే మార్పు సాధ్యం

ధరూరు: పదో తరగతి విద్యార్థి చదువుకు తొలి మెట్టు లాంటిదని జీహెచ్‌ఎం నరేష్ అన్నారు. శనివారం మండలంలోని రేవులపల్లి ఉన్నత పాఠశాలలో పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పదో తరగతి విద్యార్థుల సమావేశంలో తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడారు. నెల రోజులు పొలం, ఇంటి వద్ద పనులకు తీసుకెళ్లవద్దని కోరారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుపై వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు దేశభక్తి గేయాలకు నృత్యాలు చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ రమేష్, వైస్ చైర్మన్ జయమ్మ, ఉపాధ్యాయులు తిమ్మారెడ్డి, విష్ణు, మల్లప్ప, గోపి, సుజాత, సురేష్, పద్మ తదితరులు పాల్గొన్నారు.


నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి

మహమ్మదాబాద్: కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని మండల అధ్యక్షుడు కేఎం నారాయణ తెలిపారు. గ్రామ కమిటీల ఏర్పాటులో భాగంగా శనివారం దేశాయిపల్లిలో గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధి పనులు తప్పా తెంగాణలో అభివృద్ధి కానరావడం లేదని తెలిపారు. వైఎస్సార్ హయాంలో ఇందిరమ్మ ఇళ్లు, రుణమాఫీ, ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ వంటి ఎన్నో పథకాలతో ప్రజలకు మేలు చేకూర్చిన ఘనత కాంగ్రెస్‌దేనని అన్నారు. సోనియాగాంధీ ఆధ్వర్యంలో ప్రత్యేక తెలంగాణను ఇచ్చిందని గుర్తుచేశారు.

గ్రామ కమిటీ ఎన్నిక..

దేశాయిపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడిగా మల్లేష్, ప్రధాన కార్యదర్శిగా వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు చెన్నయ్య, కార్యదర్శులుగా రాజు, బీరయ్య, కృష్ణ, అంజిలయ్య, భగవంత్ నారాయణ, కిసాన్‌సెల్ అధ్యక్షుడు బీమయ్య, వెంకట్రాములు, కృష్ణ, రాఘవేందర్‌రెడ్డి, లక్ష్మీ ఛాంత్‌రెడ్డి ఎన్నుకున్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల చేరిక..

నవాబుపేట: మండలంలోని పోమాల్‌కు చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు శనివారం కాంగ్రెస్ నాయకుడు దుశ్యంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పోమాల్ పీర్లకుంట కాలనీకి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అంజన్‌యాదవ్, కుమార్, మీనాక్షి, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

పీఆర్సీని వెంటనే ప్రకటించాలి

కోయిల్‌కొండ: ఉద్యోగ, ఉపాధ్యాయులకు నూతన పీఆర్సీని వెంటనే ప్రకటించాలని ఎస్టీ యూటీఎస్ (స్టేట్ టీచర్ యూనియన్ తెలంగాణ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్వత్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని సూరారం, కోయిల్‌కొండ, పారుపల్లి, వింజామూర్, ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్టీ యూటీఎస్ బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి భుజంగరావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, తాహేర్, హరిప్రసాద్, నారాయణ, హెచ్‌ఎం నిర్మలాదేవి, కురుమూర్తి, శంకరయ్య, ప్రమీల పాల్గొన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న ఎస్టీ యూటీఎస్ నాయకులు



బల్బుగా.. భానుడు



సాయంకాలం వేళలో ఎర్రటి ఛాయలో భానుడు విద్యుత్ స్తంభానికి బల్బుగా మారాడు. ఇదేమిటని అనుకుంటున్నారా.. జిల్లా కేంద్రంలోని పెద్ద చెరువు కట్టపై సూర్యుడు అస్తమించే సమయంలో విద్యుత్ స్తంభానికి బల్బుగా కనిపించి చూపరులను ఎంతో ఆకట్టుకుంది.

– 'సాక్షి' సీనియర్ ఫొటోగ్రాఫర్

నట్టల నివారణ మందు తప్పనిసరి

భూత్పూర్: మండలంలోని గొర్రెలు, మేకల కాపరులు మూగ జీవాలకు నట్టల నివారణ మందులను సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి డా.మధుసూదన్ అన్నారు. శనివారం మండలంలోని మద్దిగట్ల, హస్నాపూర్, తాటిపర్తి గ్రామాల్లో 12,307 గొర్రెలు, 594 మేకలకు నట్టల నివారణ మందులు ఇచ్చినట్లు తెలిపారు.

అడ్డాకుల: మూసాపేట మండలంలోని పోల్కంపల్లిలో శనివారం గొర్రెలు, మేకలకు పశుసంవర్ధకశాఖ సిబ్బంది నట్టల నివారణ మందులను వేశారు. 4,100 గొర్రెలు, 80 మేకలకు నట్టల నివారణ మందులను వేసినట్లు వీఎల్‌ఓ సుబ్బారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది చంద్రమోహన్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

నియంతపాలనకు చరమగీతం పాడదాం

నవాబుపేట: బీఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీ మాత్రమేనని నియోజకవర్గ నాయకురాలు బాలా త్రిపురసుందరి అన్నారు. శనివారం మండలంలోని కొల్లూర్‌లో బీజేపీ కార్నర్ మీటింగ్‌లో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్ నియంత పాలనకు ప్రజలు విసిగిపోయారని, అందుకే బీజేపీ వైపు ప్రజలు చూస్తున్నరని తెలిపారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీజేపీ అధికారంలోకి వస్తుందని దీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు యాదయ్య, బాలు, శ్రీను, రాజు, నర్సింహా, సత్యం, కమలాకర్ పాల్గొన్నారు.

తల్లిదండ్రులను ఇబ్బంది పెట్టొద్దు

జడ్చర్ల టౌన్: కొడుకు నుంచి తమను కాపాడాలని ఈనెల 22న బుధవారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి వృద్ధ దంపతులు వారిని ఇంట్లోకి పంపించారు. మండలంలోని పెద్ద ఆదిరాలకు చెందిన ఇమ్మిడి భీరయ్య, తిర్మలమ్మ దంపతులను పోలీసులు, గ్రామ అధికారులు శనివారం ఇంట్లోకి పంపించారు. వారి కుమారుడు మల్లేష్‌కు కౌన్సిలింగ్ నిర్వహించి తల్లిదండ్రులను ఇబ్బంది పెట్టరాదని సూచించారు.

ముదిరాజ్‌లు హక్కుల కోసం పోరాడాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: జనాభాలో అత్యధిక శాతం ఉన్న ముదిరాజ్ సామాజిక వర్గానికి జరుగుతున్న అన్యాయాన్ని ఎదురించేందుకు ఐక్యం కావాల్సిన సమయం వచ్చిందని, హక్కుల కోసం గర్జించకపోతే భవిష్యత్ తరాలు నష్టపోతాయని పండుగ సాయన్న సేవా సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ ముదిరాజ్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జనాభా ప్రకారం ముదిరాజ్‌లకు దక్కాల్సిన వాటా కోసం తాము ఉద్యమాలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ముదిరాజ్ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని గాయత్రి ఫంక్షన్‌హాల్‌లో ఉదయం 10గంటలకు బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు సురేందర్‌బాబుతో పాటు రాష్ట్ర, జిల్లా ముఖ్య నాయకులు హాజరవుతారని పేర్కొన్నారు. ముదిరాజ్‌లను బీసీ–డీ గ్రూప్ నుంచి గ్రూప్–ఏలోకి మార్చాలని, రాజకీయంగా ముదిరాజ్‌లకు ఎమ్మెల్యే టికెట్ల కేటాయింపు, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు డిమాండ్, సంక్షేమ కార్యక్రమాల అమలులో ముదిరాజ్‌లకు జరుగుతున్న అన్యాయం వంటి అంశాలపై ఉద్యమ కార్యాచరణను ప్రారంభించేందుకు సమావేశాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాల నుంచి ముదిరాజ్‌లు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రంలోని గాయత్రి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఉదయం ముదిరాజ్‌ల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు ముదిరాజ్ సేవా సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మైత్రియాదయ్య ముదిరాజ్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా నిర్వహించే సమావేశానికి పార్టీలకు అతీతంగా హాజరు కావాలని కోరారు.

ఆర్థిక బలోపేతానికి కృషి చేయాలి


మాట్లాడుతున్న డీఆర్‌డీఓ యాదయ్య

నవాబుపేట: వీఓఏలు మరింత చొరవతో పనిచేసి ముందుకు సాగితే మహిళా సంఘాలు మరింత బలోపేతమవుతాయని డీఆర్‌డీఓ యాదయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలో మండలంలోని 84 వీఓఏలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీనిధి, బ్యాంకు రుణాలు తదితర వాటిపై నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. అలాగే మహిళలకు స్వయం ఉపాధి కోసం వస్తున్న పథకాలు వారికి అందేలా చేసి కావాల్సిన వారికి అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చే యాలని సూచించారు. మార్చి నెల రాబోతున్న తరుణంలో రికవరీలపై దృష్టి పెట్టాలని తెలిపారు. సమావేశంలో ఏపీఎం జీవరత్నం, సీసీలు రమాదేవి, కాంచన తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే ధ్యానం అలవర్చుకోవాలి

గండేడ్: నిత్యజీవితంలో విద్యార్థి దశలోనే ధ్యానాన్ని అలవర్చుకోవాలని పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ ధ్యాన ప్రచార కార్యదర్శి బంగ్లా ఆంజనేయరెడ్డి, ప్రచార కార్యకర్త అమ్మపల్లి బాలకిష్టారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని వెన్నాచెడ్, జానంపల్లి, జక్లపల్లి, సంపల్లి గ్రామాల్లో ధ్యాన అవగాహన ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ధ్యానం చేయడం వల్ల ఎన్నో లాభాలు పొందుతారని వివరించారు. శ్వాసపై దృష్టి పెట్టి ధ్యానం చేయడం వల్ల హార్మోన్ల ఉత్పత్తి జరిగి జ్ఞాపకశక్తి, ఆత్మస్థైర్యం పెరుగుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కొండల్‌రావు, హెచ్‌ఎం శంకరయ్యగౌడ్, శ్రీధర్‌రెడ్డి, రాధిక, మాసన్న, గోవింద్, బాబు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ

పాలమూరు: తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన సంవత్సర డైరీని శనివారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ కృష్ణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు శంకర్, రఫీక్, భాస్కర్‌నాయక్, శశికాంత్, జరీనాబేగం, సంధ్య కిరణ్మయి, అసోసియేషన్ సభ్యులు, కమ్యూనిటీహెల్త్ ఆఫీసర్స్ పరంకుశం, రామయ్య, పాల్గొన్నారు.

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఉద్యోగుల సమస్యలపై యూనియన్లు పని చేయాలని జిల్లా సహకార శాఖ అధికారి సుధాకర్ అన్నారు. శనివారం స్థానిక సహకారశాఖ కార్యాలయంలో తెలంగాణ కో ఆపరేటివ్ ఎన్‌జీఓ యూనియన్ జిల్లా శాఖ డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆడిట్ అధికారి, మైనార్టీ శాఖ అధికారి టైటస్‌పాల్, యూనియన్ జిల్లా అధ్యక్షుడు మహబూబ్ అలీ, కార్యదర్శి నాగరాజు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.